# పాతకారు - కొత్తస్టారు

# పాతకారు - కొత్తస్టారు

పళ్ళేలు పట్టుకునే వేషాలుపోయి సైడు హీరోయిన్ వేషాలు రావటం మొదలయ్యేసరికి మణిశ్రీకి కొత్తకారు కావాలనే బుద్ధి పుట్టింది.

మణిశ్రీ వురఫ్ మాణిక్యం తిరునాళ్ళ ప్రభలమీద డాన్సు చేసేదొకప్పుడు. అలాంటి కుమారి అమాంతం 'ఏ' క్లాసు 'స్టారు' సరాసరి కాలేకపోయినా నేటికి (దినదినాభివృద్ధి చెందుతూ) ప్రముఖ సినీ తారగా వెలిగిపోతోంది.

వాల్ పోస్టర్లలో, పేపర్లలో, తన బొమ్మ చూచుకొని మురిసిపోవాలనీ, వెయ్యి వోల్టుల బల్బులా మెరిసిపోవాలనే ఒకనాటి ఆశ నెరవేరింది.

పెద్దగా వెలిగే వారందరికీ అంతకుమించిన పెద్ద కథేదైనా వాళ్ళ కడుపులో జీర్ణించుకునే వుండిఉంటుంది అనుకొంది. అట్లాగే-మణిశ్రీ వెనకాలకూడా ఒక చిన్న కథొకటుంది!

సినీమాల్లో హీరోయినై పోవాలనే తపన వుండేరోజుల్లో కొత్త ముఖాలు కావాలని పేపరులో ఎవరో ప్రకటించటం చూచింది. రంగసామిగాడి ఫోటో స్టూడియోకెళ్ళి మూడు రకాల పోజుల్లో బొమ్మలు తీసేయించుకొంది, పోస్టులో పంపేసింది.

మద్రాసుకు రావలసిందిగా కబురొచ్చింది!–

ఎగిరి గంతేసింది మాణిక్యం!

అమ్మకు చెప్పకుండా డాన్సు ప్రోగ్రాంలో వచ్చిన వందరూపాయలు తీసుకొని 'సర్కారెక్సుప్రెస్' ఎక్కింది.

ఊరు కొత్తే అయినా తెలివిగా సినీమా వాళ్ళను చేరుకొంది.

తనకు మల్లేనే బోలెడుమంది మగాళ్ళు, ఆడవాళ్ళు వచ్చారు.

ఒక్కొక్కరే గదిలోకిపోయి వస్తున్నారు.

ఓడిపోయిన యం. ఎల్. ఎ. లాగ, వుద్యోగంరాని కుర్రాళ్ళలాగ, పెళ్ళికొడుక్కు నచ్చని పెళ్ళికూతురులాగ బైటికొస్తున్న వ్యక్తుల ముఖాలు తోటకూర కాడల్లాగ వాడిపోయినయి.

స్వయంవరంలో మాణిక్యం వంతు రానేవచ్చింది. తుర్రున లోపలికి పోయింది.

బొద్దుగా ముద్దుగావున్న మాణిక్యాన్ని గదిలో ఉన్నాయన ఎగాదిగా చూశాడు.

"నువ్వు సూటవుతావ్!" అన్నాడు.

ఆ భాష అర్థంకాని మాణిక్యం వెర్రిముఖం వేసింది.

"రాత్రి కిక్కడేవుండు. నిన్ను టేస్టు (సారీ టెస్టు) చేయాలి" అన్నాడు మళ్ళీ.

అక్కడే వుండిపోయిం దా రాత్రి!

టెస్టులో ఫెయిలైంది!

అసహ్యం వేసింది. ఆడి యవ్వారం చూడ సిరాకన్పించింది. ఇదా సినిమా పెపంచకం అనేసి తిట్టుకుంది.

ఆడి వాలకం పసికట్టి జాగ్రత్తపడి తెల్లారేక తిరుగు రైల్లో యింటిదారి పట్టింది.

అమ్మా అయ్యా ముఖం వాచేలా చీవాట్లు పెట్టారు ఇంటి కొచ్చాక. తప్పేనని చెంపలేసుకుంది.

కాని...తను యెట్లాగైనా స్టారు నవ్వాలని వువ్విళ్ళూరుతూ రాత్రింబవళ్ళు బంగారు కలలు కంటోంది.

మాణిక్యం మనసులో 'సినిమా దురద' పురుగులాగ పట్టుకుని బుర్రను తొల్చేస్తోంది.

అసలు స్టారు నవుతానో లేదోనని ప్రతి శనివారం ఎరుకుల సుక్కమ్మను పిలిపించుకొని సోది చెప్పించుకొనేది. సంత కెళ్ళినప్పుడల్లా సన్యాసోళ్ళకు చెయ్యి చూపించుకునేది. అప్పుడప్పుడు చిలక ప్రశ్నలుకూడా అడిగేది!

రికార్డు డ్యాన్సులు చేసే రోజుల్లో, హార్మోనిస్టు గవ్వరాజును లవ్వాడేసింది.

గవ్వరాజుగాడు మాణిక్యం మనసులో ఆలోచనల్లను హిరణ్యకశిపుడిలా పసిగట్టేశాడు. 'వారేవా!' అనుకున్నాడు.

పట్నం తీసుకెళ్ళి సినిమా ఛాన్సు ఇప్పిస్తానన్నాడు. స్టారయిపోయినట్టే సంతోషించి 'సై' అని తలూపింది మాణిక్యం.

పట్నంలో పదిరోజు లుండేసరికి తెచ్చుకున్న డబ్బు లైపోయినయ్. మోజు తగ్గింది!

రైలు టిక్కెట్టుకయినా డబ్బులేక 'ఎఫెస్సుగా' రైల్లో బెజవాడదాకా వచ్చి ఇల్లు చేరుకున్నారు.

ఆశ నెరవేరకపోవటంతో గవర్రాజును గాడిదకొడుకులా చూచి 'ఛీ' కొట్టింది.

* * *

పొట్టపొడిస్తే అక్షరం ముక్కయినా రాని మాణిక్యం మణిశ్రీ అయ్యాక, ఇంగ్లీష్ కాన్వెంట్ లోనే తన చదువంతా వెలగబెట్టానని పత్రికలోళ్ళతో చెప్పేసింది. కరెంటులాంటి ఆ వార్త తాటికాయలంత అక్షరాల్తో పేపర్లోపడి కలరా లాగా దేశమంతా పాకిపోయింది.

ఒకసారి తను యాక్టుచేసిన సినీమా శతదినోత్సవాని కొచ్చి అసలు తను కళకోసమే పుట్టానన్నది. సినీమాలోకం అంతా నిజమేనని నమ్మేశారు. కానీ హార్మోనిస్టు గవర్రాజు 'ఛీ! నీ బతుకుసెడ' అని దూరంగా జనంలో నిల్చొని తుపుక్కున ఉమ్మేశాడు.

పైడిరాజు మణిశ్రీ రెండోమేటు! పైడిరాజు పిల్లల కోడి. పచ్చని సంసారం నట్టేట్లో వదిలేసి మాణిక్యం మోజులోపడి జీవితాన్ని మేజువాణిలాగ గడపాలనుకున్నాడు.

వున్న కాస్త పొలం, ఇల్లూ అమ్మేశాడు. మాణిక్యాన్ని వెంటేసుకొని మద్రాసొచ్చాడు.

సినీమాల్లో హీరో హీరోయిన్లకుమల్లే చెట్టాపట్టీ లేసుకొని ఇద్దరూ సిమెంటు రోడ్లమీద తిరిగారు. పెద్ద హోటళ్ళలో అద్దెకున్నారు.

హోటల్లో పక్కగదిలో ప్రొడ్యూసరెవడో దిగాడనే విషయం పసిగట్టేసింది మాణిక్యం. మాణిక్యం మనసు 'ఛాన్సు' కోసం తహతహలాడింది.

పద్నాలుగో నెంబరు గదిలో ప్రొడ్యూసరు గొప్పోడు. మాణిక్యాన్ని చూడగానే క్రింది పెదిమను మునిపళ్ళతో నొక్కిపట్టి 'తస్సదియ్యా' అనుకున్నాడు. వెంటనే కార్లో (అద్దెది) వెంటేసుకొని అర్ధరాత్రిపూట నాలుగుస్టూడియోలు తిప్పాడు. ప్రొడ్యూసరు పరపతి, హడావుడి చూసి అదిరిపోయింది మాణిక్యం.

కొత్తోడి గొప్ప ఐడియాల్లో సాలీడులా అంటుకుపోయిన మాణిక్యం, పైడిరాజు కళ్ళకు మళ్ళీ అవుపించనైనా లేదు.

ఓ నెల రోజులయ్యాక "నా యాషం సంగతేంగానూ?" అనేసి నిలదీసి అడిగింది.

నవ్వి ఊరుకున్నాడు గొప్పోడు.

మాణిక్యం మనసు మండిపోయింది. కోపం నిండిపోయింది. ఆ పళాన ఆడిమీద విరుచుకు పడ్డది!

"ఒరి నీ ముఖం మండా! పొడ్యూసరు పొడ్యూస

రంటూ నువ్వు నేసే నిర్వాకం ఇదా?! ఇట్టాంటి బతుకు బత కక్కపోతేనేం?" అక్కసు వెళ్ళబోసుకుంది.

"సినీమా ప్రపంచకం సంగతి నీకు బొత్తిగా తెలవదే సిట్టే! వట్టి బోళా మనిసివి నువ్వు? యోషాలు కావాలంటే కళ్ళు మూసుకుని కలలుకంటే వస్తాయా? పెద్దోళ్ళ కళ్ళల్లో కాళ్ళల్లో తళుకులా మెరవాలి! చెప్పులా మెలగాలి! నీ చుట్టూ తిప్పుకోవాలి! ఆళ్ళ చుట్టూ నువ్వు తిరగాలి..." ఇంకా యేదో చెప్పుకుపోతున్నాడు.

"సీ యెదవ...నీ తార్పుడు యవ్వారాలింక నాకాడ సాగవ్!" అనేసిందిగాని...'ఇప్పు డీడిని కాదంటే తన కర్మేం గాను? బతికే దెట్లా? ఇంటి కెట్లాగూ యెళ్ళే రాతలేదు' అను కుంది. అంచేత...తాపా మరపా జీవితానికి బల్లిలా అతుక్కు పోయింది.

పట్నం నీళ్ళు వంటబట్టాయి. షోకులు నేర్చుకుంది. మాట మార్చుకుంది. ఇంగ్లీషు సినిమాలు చూడటం ఆరం భించింది.

ఒక శుభముహూర్తాన గోపోడికి [ప్రొడ్యూసరు] తోక కోసి సున్నం ఏెట్టింది! అడ్డి నిలువునా ఆర్పేసింది!

లంకలో సీతామ్మవారిలాగ కష్టాలేం పడ్లేదు.

ఆడి డబ్బుతో (వెలిగి వెలిగి ఆరిపోయిన) సీనియర్ సినిమాస్టారు దగ్గర కారు కొనేసింది. తనూ ఆమెలాగ వెలగా లనుకుంది. ఆరిపోవాలని మాత్రం అనుకోలేదు.

కారు కొనగానే స్టారుతిరిగి తారాజువ్వలాగా సినిమా ప్రపంచం పైకి పోవాలనుకుంది! సూదంటు రాయిలాగా వెండి తెరకు అతుక్కు పోవాలనుకుంది!! కాకరపువ్వొత్తి లాగా వెలిగిపోవాలని ఆశించింది!!!

డ్రైవింగు నేర్చుకుంది.

ప్రతి ఆదివారం స్విమ్మింగ్ డ్రస్సులో మెరీనాబీచ్ కెళ్ళి మార్లిన్ మన్రోలాగ మెరిసిపోతోంది.

రోజూ క్లబ్బులకెళ్ళి పదిమంది పెద్దోళ్ళకూ 'మందు' పట్టిస్తోంది.

చిన్న చిన్న వేషాలు సంపాదించుకుంది.

సినీమా కష్టాలు గట్టెక్కాయనుకుని గట్టిగా గాలి పీల్చుకుంది.

జాతక చక్రం గిర్రున తిరిగింది!

మాణిక్యం మణిశ్రీ అయి కూర్చుంది!?

పైకి రావాలన్నా, పరపతి పెరగాలన్నా అసలు కిటుకేంటో తెలుసుకుంది. అందులో 'యవ్వారాన్ని' అర్థం చేసుకుంది.

ఎర్రటోపీ వోడి కాకీ గుడ్డల్లా కాకుండా, ఖద్దరు గుడ్డలోడి తెల్లటోపిలాగ పరపతి పెంచుకుంటోంది.

ఉండి వుండి పెద్దమేడ కట్టేసింది!

కాపలాకి గేటుముందు గూర్ఖావాడ్ని పెట్టింది.

ఒక వేటకుక్కనూ, మరో రెండు జాతికుక్కలనూ పెంచుకుంటోంది.

క్షణానికో డ్రస్సు! నిమిషానికో పోజు!!

పెద్ద పెద్ద హీరోలంతా ఆళ్ళ పక్కనే తను నటించాలంటూ పోటీపడి వెంట తిరుగుతున్నారు.

ప్రొడ్యూసర్లు 'కాకా' పడుతూ కుక్కల్లా కార్లల్లో ఇంటికొస్తున్నారు.

పత్రికలోళ్ళు ఫొటోల కోసం ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఫోన్లమీద ఫోన్లు చేస్తున్నారు.

పెద్ద బస్సోడు చిన్న కారోడికి 'సైడి' చ్చినట్టు మణిశ్రీ సిసీ జీవితానికి సిగ్నలిచ్చేసింది. సఁయ్‌మంటూ ముందుకు సాగిపోతున్నది.

కుమారిగానే జీవితాంతం వుండిపోయి కళాసేవ చేయాలని తీర్మానించుకుంది. పేపర్లో అచ్చేయించుకుంది.

సన్మానాలు చేయించుకుంటోంది! బిరుదు లిప్పించుకుంటోంది!!

ఖరీదైన వాళ్ళకోసం కళ్ళు పెద్దవి చేస్తోంది. కాని వాళ్ళనుకుంటే అవే కళ్ళు చిన్నవి చేస్తోంది.

కరువులకు, కాటకాలకు, బీదోళ్ళకు, దేవుళ్ళకూ దానాలు చేస్తోంది.

ఏటేటా వెంకటేశ్వరస్వామి దగ్గరకెళ్ళి నల్ల డబ్బును 'హుండి'లో పడేస్తోంది. తెల్లడబ్బు గుంభనగా దొడ్డిదోవన రాబట్టుకుంటోంది.

కానీ...అయినా...తన స్టారు తిప్పిన పాతకారుకు ప్రతిరోజూ పూజచేసి కొబ్బరికాయ దిష్టితీస్తోంది - సిరికీ, సంపదకీ మెరిసిపోయి మురిసి పోతోంది !!!